గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకురావాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

సుభాష్‌నగర్, అక్టోబర్ 7 : జిల్లాలో శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకరావాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన అంతిరెడ్డి రాజారెడ్డి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార సంఘాల లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ పై నుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

వినాయక్‌నగర్, అక్టోబర్ 7 : నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి బైక్ పై వెళుతుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. నర్సింహులు ద్విచక్రవాహనంపై నగరంలోని సీపీ కార్యాలయం వద్ద సోమవారం అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు.

పాలస్తీనా, ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలి

నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీలు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 7 : జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీపీఐ, సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ మాస్‌లైన్, ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో ఇజ్రాయిల్ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. ఏడాది కాలంగా ఇజ్రాయెల్, పాలస్తీనా యుద్ధం కొనసాగుతున్నదని, ఇందులో వేల మంది మరణిస్తున్నారని అన్నారు. ఐక్యరాజ్యసమితి, న్యాయస్థానం యుద్ధం ఆపాలని చెప్పినప్పటికీ ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు కొనసాగించడం సబబు కాదన్నారు. యుద్ధాన్ని ఆపి ప్రపంచ శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌బాబు, శివ, లింగం, ఓమయ్య, రాజన్న, నూర్జహాన్, సుజాత, రాజు, వెంకట్, రఘురాం, అనిల్, రమేశ్, రాధాకుమార్ పాల్గొన్నారు.

నవీపేట్‌లో చోరీ

నవీపేట్, అక్టోబర్ 7: నవీపేట్ మండలంలోని జగ్గయ్యఫారానికి చెందిన కేతావత్ లత ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం.. లత ఆమె భర్త, పిల్లలు కలిసి ఈనెల 6న రాత్రి భోజనాలు చేసి పక్క ఇంట్లో నిద్రించారు. సోమవారం ఉదయం లేచి చూసే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. వారు వెళ్లి పరిశీలించి చోరీ జరిగినట్లు గుర్తించారు. రెండు మొబైల్ ఫోన్లు, పుస్తెల తాడుకు ఉన్న అర తులం బంగారు బిల్లలు చోరీకి గురైనట్లు గుర్తించారు. లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్, ఆయిల్ చోరీ

ఎడపల్లి, అక్టోబర్ 7: మండల కేంద్రం శివారు దుబ్బతండా ప్రాంతంలో దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, కాపర్ వైర్, ఆయిల్‌ను సోమవారం చోరీ చేశారు. దుబ్బతండా గ్రామానికి చెందిన రైతులు భీమ్లానాయక్, సురేశ్, శ్రీనివాస్ వారి పొలానికి నీరు పారించేందుకు వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమై ఉండడాన్ని గమనించారు. ట్రాన్స్‌కో అధికారులతోపాటు, పోలీసులకు సమాచారం అందించారు.

మండపాల వద్ద పూజలు, అన్నదానాలు

ఘన్‌పూర్‌లో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సిరికొండ మండలం న్యావనందిలో..

శాకంబరి అలంకరణలో ఉమామహేశ్వర ఆలయంలోని రాజరాజేశ్వరీమాత

కోటగిరి/ సుభాష్‌నగర్/ డిచ్‌పల్లి/ధర్పల్లి / జక్రాన్‌పల్లి/ మోర్తాడ్, నవీపేట, అక్టోబర్ 7 : జిల్లావ్యాప్తంగా దేవీ నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం అమ్మవార్లను చండీ దేవి, శాకాంబరి తదితర రూపాల్లో అలంకరించారు. మాలధారులు, భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానాలు చేశారు. జిల్లా కేంద్రంలోని కిషన్‌గంజ్‌లో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాతను ధనలక్ష్మీ రూపంలో అలంకరించి, అర్చకుడు వేలేటి గౌరీశంకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వాసవీమాతను రూ. 13 లక్షల కరెన్సీతో అలంకరించారు. శ్రద్ధానంద్ గంజ్‌లోని ఉమా మహేశ్వరాలయంలో ఆశ్వయుజ శుద్ధ పంచమి, సోమవారం పురస్కరించుకొని రాజరాజేశ్వరీ మాతను 21 రకకాల కూరగాయాలతో శాకంబరిగా అలంకరించారు. అన్నపూజ, నమక చమక రుద్రాభిషేకాలతో అభిషేకం, తీర్థ ప్రసాదాల పంపిణీ తదితర కార్యక్రమాలు అర్చకుడు ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో కొనసాగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామంలోని దుర్గా మాత మండపం వద్ద సుహాసినులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని మండపం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. సిరికొండ మండలంలోని న్యావనంది గ్రామంలో ఉన్న మండపం వద్ద కుంకుమార్చన పూజలు చేశారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం బోనాల ఊరేగింపులో స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో దేవీనవరాత్రులను నిర్వహిస్తున్నారు. కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గ్రామంలో బోనాలతో వచ్చి దుర్గాదేవీకి పూజలు జరిపించారు. నవీపేట మండల కేంద్రంలో జై భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమాత మండపం వద్ద కుంకుమార్చన చేశారు.

కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌లో దుర్గాదేవికి పూజలు

డిచ్‌పల్లిలో దుర్గామాత మండపం వద్ద అన్నదానం

నవీపేటలో కుంకుమార్చన పూజలో పాల్గొన్న మహిళలు

ఎస్సీ వర్గీకరణ చేయకుండా పోస్టులను భర్తీ చేయడం తగదు

- 9న నిరసన ప్రదర్శనలు
- ఎంఎస్ఎఫ్ టీయూ అధ్యక్షుడు దినేశ్ మాదిగ

డిచ్‌పల్లి, అక్టోబర్ 7 : సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించి ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణ అమలుచేస్తామని అసెంబ్లీలో హామీనిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఎస్సీ వర్గీకరణ చేయకుండా 11,062 టీచర్ పోస్టులను నియామకం చేయడం మాదిగ జాతికి నమ్మక ద్రోహం చేయడమేనని ఎంఎస్ఎఫ్ టీయూ అధ్యక్షుడు దినేష్ మాదిగ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోని ఎస్సీ వర్గీకరణను ముందుగా తెలంగాణలోనే అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీనిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. అందుకు విరుద్ధంగా తన పరిధిలోని విద్యాశాఖలోనే ఎస్సీ వర్గీకరణ లేకుండానే ఉద్యోగాల భర్తీకి సిద్ధపడడం దారుణమన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకుండా అడ్మిషన్లు జరుగుతుండడంతో మాదిగలు నష్టపోతున్నారని అన్నారు. సీఎం వైఖరిని నిరసిస్తూ ఈనెల 9న అన్ని జిల్లాలు, మండలాల్లో నల్లజెండాలతో నిరసన తెలుపనున్నట్లు చెప్పారు. ట్యాంక్ బండ్ వద్ద ఉన్న బీఆర్.అంబేడ్కర్ విగ్రహం నుంచి బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి ర్యాలీని చేపడతామన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

చింతగణేశ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, అక్టోబర్ 7: కమ్మర్‌పల్లి మండలంలో పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం రాత్రి పరామర్శించారు. కమ్మర్‌పల్లికి చెందిన చింత గణేశ్ శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. హాసాకొత్తూర్ గ్రామంలో అడ్వకేట్ ఎలేటి గంగాధర్ తల్లి ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, నాయకులు గడ్డం స్వామి, గోపిడి లింగారెడ్డి, చిన్నారెడ్డి, బద్దం రాజేశ్వర్, సంత రాజేశ్వర్, సుధాకర్, హరీశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

వినాయక్‌నగర్, అక్టోబర్ 7: నగర శివారులోని సారంగాపూర్ ఏరియాలో సోమవారం ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కాలువగట్టుపై కూర్చొని ఉన్న వ్యక్తి.. ప్రమాదశాత్తు అందులో పడిపోయాడు. గమనించిన స్థానికులు కాలువలో గాలింపు చర్యలు చేపట్టి. మృతదేహాన్ని వెలికితీశారు. ఆరో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడికి సంబంధించిన ఆధారాలు లభించలేదని, కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..

శక్కర్‌నగర్, అక్టోబర్ 7: బోధన్ పట్టణ శివారులోని రవి గార్డెన్ పరిసర ప్రాంతంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణంలోని బీటీ నగర్‌కు చెందిన షేక్ లాయఖ్ (23) అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, తండ్రి అబ్దుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ వెంకట నారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు. సీఐ కథనం మేరకు.. బీటీ నగర్‌కు చెందిన షేక్ లాయఖ్ అతని స్నేహితులు ఆర్బాజ్, మారూఫ్, జునేద్ కలిసి ఓ ట్రాలీ ఆటోలో రవిగార్డెన్ సమీపంలోని పంటపొలాల వైపు వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో లాయఖ్ మృతి చెందాడు. మిగిలిన వారు ఆటోను, లాయఖ్ మృతదేహాన్ని రవి గార్డెన్ పరిసర ప్రాంతంలోని ఓ గాజు పెంకుల ఫ్యాక్టరీ వద్ద వదిలి వెళ్లారు. లాయఖ్ మృతి చెందిన విషయాన్ని పరారీలో ఉన్న వ్యక్తుల్లో ఒకరు మరో స్నేహితుడికి ఫోన్‌ద్వారా చెప్పాడు. దీంతో వారి స్నేహితుడు మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. కాగా తన కుమారుడిని హత్య చేశారని మృతుడి తండ్రి అబ్దుల్లా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు ఆటోను సీజ్ చేసి, పరారైన మరో ముగ్గురి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని దవాఖానకు తరలించిన వ్యక్తికోసం కూడా పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఎడపల్లి, అక్టోబర్ 7: మండలంలోని ఠాణాకలాన్ గ్రామంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. కుర్నాపల్లిలోని అబ్బయ్య దర్గా పరిసర ప్రాంతంలో మృతుడు భిక్షాటన చేసేవాడు. వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

బాధ్యతల స్వీకరణ

మాక్లూర్, అక్టోబర్ 7: మండల కేంద్రానికి చెందిన సాయినేని వెంకటేశ్వర్‌రావు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

ముప్ప గంగారెడ్డికి సన్మానం

నందిపేట్, అక్టోబర్ 7: జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ముప్ప గంగారెడ్డి, వైస్‌చైర్మన్ జంగిటి రాంచందర్, డైరెక్టర్ పెంట ఇంద్రుడు, డైరెక్టర్ సాయినేని వెంకటేశ్వర్‌రావును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద మహిపాల్ సోమవారం సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చెరువు వద్ద ఏర్పాట్ల పరిశీలన

కోటగిరి, అక్టోబర్ 7 : మండలకేంద్రంలోని దామరచెరువు వద్ద బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ గంగాధర్ సోమవారం పరిశీలించారు. మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. వారి వెంట ఆర్ఐ సయ్యద్, ఎంపీవో చందర్, కార్యదర్శి ముజాఫర్‌బేగ్ ఉన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శంకర్

ఖలీల్‌వాడి, అక్టోబర్ 7 : అంతర్జాతీయ వస్తు, సేవల నాణ్యతా ప్రమాణాల ఉత్సవాలను ఈనెల 7 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి తెలిపారు. వస్తుసేవల నాణ్యతా ప్రమాణాలకు సంబంధించిన పూర్తి వివరాలు, వినియోగదారుల (8) హక్కులు ప్రాధాన్యత వివరాలతో కూడిన పోస్టర్లను మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శంకర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి వినియోగదారుల సంఘాలతో కలిసి ఆహార భద్రతా కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇందూరు వినియోగదారులు, సంక్షేమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు పెందోట అనిల్‌కుమార్, సందు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వీఎన్.వర్మ, సంయుక్త కార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్, ఎన్.రమేశ్ పాల్గొన్నారు.

గూపన్‌పల్లి వీడీసీ ఎన్నిక

వీడీసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

సారంగాపూర్, అక్టోబర్ 7: నగర శివారులోని విలీన గ్రామమైన గూపన్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)ని అన్ని కుల సంఘాల సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీడీసీ చైర్మన్‌గా దుడ్డు పోతన్న, క్యాషియర్‌గా చిటికెల సంతోష్‌రెడ్డి, రైటర్‌గా సంగెం సుభాష్‌తోపాటు 18 మంది సభ్యులను ఎన్నుకున్నారు. వీడీసీ కార్యవర్గాన్ని కార్పొరేటర్ చిటికెల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామపెద్దలు సన్మానించారు.

ముస్లింల ర్యాలీ

శక్కర్‌నగర్/ఎడపల్లి/నవీపేట/రుద్రూర్, అక్టోబర్7: ముస్లింలు పవిత్రంగా భావించే మహ్మద్ ప్రవక్తపై కొందరు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడాని నిరసిస్తూ సోమవారం బోధన్ పట్టణంలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఎడపల్లిలో ముస్లింలు పోలీసు స్టేషన్ లో రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సై వంశీకృష్ణారెడ్డికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. నవీపేట మండల కేంద్రంలో ముస్లింలు దుకాణాలను బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఎస్సై వినయ్, డిప్యూటీ తహసీల్దార్ తెలంగ్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. రుద్రూర్ మండలకేంద్రంలో జామా మసీదు కమిటీ ఆధ్వర్యంలో మండల ముస్లింలు తహసీల్దార్ తారాబాయితోపాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బోధన్ పోలీస్ స్టేషన్ ఎదుట బైక్ దహనం

శక్కర్‌నగర్, అక్టోబర్ 7: బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం రాత్రి ఓ వ్యక్తి న్యూసెన్స్ సృష్టించాడు. ఉన్నట్టుండి పోలీస్ స్టేషన్ ఎదుట బైక్‌పై పెట్రోల్‌పోసి నిప్పంటించాడు. పోలీసుల కథనం.. సోమవారం రాత్రి ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన నుంచి డబ్బులు తీసుకున్న వ్యక్తి తనకు డబ్బులు ఇవ్వడం లేదని, తనకు డబ్బులు ఇప్పించాలంటూ పోలీసులను కోరాడు. ఇది తమ పరిధిలోకి రాదని కోర్టుకు వెళ్లాలని పోలీసులు చెప్పారు. దీంతో ఆగ్రహంతో సదరు వ్యక్తి తన భార్య, పిల్లలను కొడుతూ బయటికి వెళ్లి తన ద్విచక్ర వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. పోలీసులు వాహనంపై నీరు పోసి మంటలు ఆర్పారు. ఈ సంఘటనపై పట్టణ సీఐ వెంకట నారాయణను వివరణ కోరగా, డబ్బుల విషయం తమ పరిధిలో లేకున్నా సదరు వ్యక్తి డబ్బులు ఇవ్వాలని చెప్పిన వ్యక్తిని పిలిపించి అడిగామని అన్నారు. తాను డబ్బులు ఇచ్చేది లేదని, అయినా. తనను ఇబ్బంది పెడుతున్నాడంటూ ఆయన పోలీస్‌స్టేషన్‌లో సమాధానం చెప్పాడని సీఐ తెలిపారు. సదరు వ్యక్తి సుమారు గంటకు పైగా పోలీస్ స్టేషన్ ఎదుట న్యూసెన్స్ సృష్టించాడని సీఐ వెల్లడించారు.

సంక్షిప్తంగా..

- **సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**- ఆర్మూర్‌టౌన్,అక్టోబర్7: పట్టణంలోని హౌసింగ్ బోర్డుకు చెందిన కవితకు సీఎంఆర్ఎఫ్ చెక్కును బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్ సోమవారం అందజేశారు.
- **వాహనదారులకు జరిమానాలు**- బాల్కొండ, అక్టోబర్ 7: మండలంలో హెల్మెట్ లేకకుండా వాహనాలు నడిపినవారు, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. పలు వాహనాలను సీజ్ చేశామన్నారు.
- **ఎస్ఆర్ శంకరణ్‌కు ఘననివాళి**- మోర్తాడ్, అక్టోబర్ 7: మోర్తాడ్ మండల దళితసంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఎస్ఆర్ శంకరణ్ వర్ధంతిని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శంకరణ్ బ్రాహ్మణ కులంలో పుట్టి బడుగుబలహీనవర్గాల ప్రజల కోసం గురుకుల పాఠశాలలు నెలకొల్పి మహనీయుడని కొనియాడారు. మల్లూరి రాజారాం, జాంభవ, రవి, రమేశ్ పాల్గొన్నారు.
- **ఫైరింగ్‌లో విద్యార్థిని ప్రతిభ**-ఏర్గట్ల, అక్టోబర్ 7: మండల కేంద్రానికి చెందిన సుదానవేణి స్వాతిక ఎన్‌సీసీ నేషనల్ క్యాంపుతోపాటు అనేక క్యాంపుల్లో ప్రతిభ చూపి తుపాకీ ఫైరింగ్‌లో మెడల్ సాధించింది. ఆమెను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సన్మానించి, నగదు ప్రోత్సాహకం అందించినట్లు ఏర్గట్లకు చెందిన పార్టీ నాయకులు సోమవారం తెలిపారు.
- **కలుపు నివారణ మందు ఆవిష్కరణ**- ఏర్గట్ల, అక్టోబర్ 7: మండల కేంద్రంలో ట్రాక్టర్ బ్రాండ్ ఇన్సెక్టిసైడ్ కంపెనీ ప్రతినిధులు మక్కజొన్న పంటలో కలుపు నివారణకు టోరీ సూపర్ అనే గడ్డి మందును సోమవారం ఆవిష్కరించారు. ఏరియా మేనేజర్ ఏఎం నరేశ్, సీనియర్ సేల్స్ ఆఫీసర్ రాజశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.
- **కొనసాగుతున్న పరీక్షలు** - ఖలీల్‌వాడి, అక్టోబర్ 7 : నిజామాబాద్ జిల్లాలో ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఎస్సెస్సీ విద్యార్థులకు సోషల్ పరీక్ష నిర్వహించగా.. 74 మంది విద్యార్థులకు 58 మంది హాజరైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు హిస్టరీ పరీక్ష నిర్వహించగా 28 మంది విద్యార్థులకు 21 మంది హాజరైనట్లు వెల్లడించారు.

యువత వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచన
- ఘనంగా జిల్లా ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న నిజామాబాద్ ఏఎంసీ నూతన పాలకవర్గం

ఖలీల్‌వాడి/ మోర్తాడ్/ వేల్పూర్/ ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 7 : వ్యవసాయంపై యువత ఆసక్తి చూపాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోధన్, రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి హాజరయ్యారు. కార్యాలయంలో చైర్మన్ ముప్ప గంగారెడ్డి, వైస్‌చైర్మన్ జంగిటి రాంచందర్, బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్, వైస్‌చైర్మన్‌తో డీఎంవో గంగు, డైరెక్టర్లతో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ అపర్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు అన్నిరకాల పంటలు పండించేలా మార్కెటింగ్ శాఖ, పాలకవర్గం అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక టెక్నాలజీని వాడుకోవాలని రైతులకు సూచించారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేలా పాలకవర్గం కృషిచేయాలని సూచించారు. మార్కెట్‌లో సద్దిమూట కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, కార్పొరేటర్ పంచరెడ్డి ప్రవళిక, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, సుంకెట అన్వేశ్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నాయకులు నగేశ్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, గడుగు గంగాధర్, కేశవేణు, జావిద్ అక్రమ్, డీసీసీబీ డైరెక్టర్లు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి, వేల్పూర్

మార్కెట్ కమిటీల పాలకవర్గాలు..

కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని లలితా గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పాలెపునర్సయ్య, వైస్‌చైర్మన్‌గా సుంకెట బుచ్చన్న, డైరెక్టర్లుగా మధులత, ముత్తెన్న, జీవన్, బాబన్న, రాములు, సంపత్‌రెడ్డి, దేవేందర్, భూమయ్య, శ్రీనివాస్, నవీద్, మహిపాల్, లింగారెడ్డి, రంజిత్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, అన్వేశ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యాలరాములు, సుంకెట రవి పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలో నిర్వహించిన వేల్పూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముత్యంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్సారెడ్డితోపాటు పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యం రెడ్డికి, వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, సభ్యులను సన్మానించారు.

కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న నర్సయ్య

నామినేషన్ల పరిశీలన పూర్తి

బోధన్, అక్టోబర్ 7: బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పరిశీలన అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ఎన్నికల అధికారులు పోశెట్టి, ఎంబెల్లి శంకర్, సాయిలు, అజయ్ కుమార్ సోమవారం వెల్లడించారు. అధ్యక్ష పదవికి గంగాధర్‌రావు పట్వారీ, రుద్ర సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పదవికి గంగుల దేవీదాస్, బీర్కూర్ శంకర్ (బుజ్జి), కోశాధికారి పదవికి గుంత గంగాధర్, మాసుల శ్రీనివాస్, గమరపేట శ్రీనులు, ఉపాధ్యక్ష పదవికి పసులేటి గోపికిషన్, సూర లింగం, గుమ్ముల సాయారెడ్డి, ఉద్మీర్ సాయిలు, కార్యదర్శి పదవికి ఈరపురం చిన్న పోశెట్టి, నాగన్‌పల్లి మధుకర్, బండారి లింగం, కురుమ శంకర్, దాల్మల్క శంకర్, దండు సంగ్రాంలు పోటీలో ఉన్నట్లు వెల్లడించారు. ఈనెల 9న ఎన్నిక నిర్వహ